ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.6, కనిష్ఠం 24.6



నిర్మల్
జిల్లా వార్తలు

సోమవారం 5 మే 2025

ఆరేంజ్ జోన్‌లో నిర్మల్ జిల్లా

ఖానాపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో ఉష్ణోగ్రతలు భారీగా నమోదు అవుతున్నాయి. జిల్లాలో గత రెండు రోజులు వరుసగా 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జిల్లాలోని పలు మండలాల్లో అధికారులు ఆరేంజ్ అలర్ట్ జారీ చేశారు. కాగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిర్మల్ జిల్లాలో 41.3 నమోదు కావడంతో జిల్లాలో ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేశారు. ఉష్ణోగ్రతలు భారీగా నమోదు అవుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

రింగ్‌రోడ్డు ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం!



నిర్మల్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న ఎన్‌హెచ్ నెంబర్ 44

- అటకెక్కిన రూ.35 కోట్ల అంచనాలు
- నాలుగు గ్రామాలను కలుపుతూ లింకేజీ
- 30 కిలో మీటర్ల పొడవుతో రూట్ మ్యాప్ రూపకల్పన

నిర్మల్, మే4 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రమైన నిర్మల్ పట్టణం రోజురోజుకు విస్తరిస్తుండడం, అలాగే సమీప గ్రామాలు పట్టణానికి క్రమంగా చేరువ వుతుండడంతో పట్టణ విస్తీర్ణం దాదాపు 30కి పైగా కిలోమీటర్లకు చేరుకోబో తోంది. తూర్పు వైపు నుంచి పడమర వైపుకు పడమర వైపు నుంచి తూర్పు వైపునకు ఉన్న గ్రామాలకు వెళ్లాలంటే ప్రస్తుతం నిర్మల్ పట్టణం మీదుగానే వెళ్లాల్సి వస్తోంది. దీంతో దూరభారం, అధిక సమయం, ట్రాఫిక్ చిక్కులు జనాలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. వ్యయ ప్రయాసాల కోర్చి తమ గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. జిల్లాకేంద్రంగా ఏర్పడిన నాటి నుంచి నిర్మల్ పట్టణానికి చుట్టూ గ్రామాల జన సంచారం కూడా విపరీతంగా పెరిగిపోయింది. ప్రజల రాకపోకలు పెరిగిపోవడంతో నిర్మల్ ప్రతీరోజు కిటకిటలాడుతోంది. ఇలాంటి నేపథ్యంలో అధికారులు నిర్మల్ చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు దూర భారం తగ్గించేందు కోసం ప్రత్యే కంగా రింగ్ రోడ్డు ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. నిర్మల్ చుట్టూరా 30 కిలోమీటర్ల మేరకు ఈ రింగ్ రోడ్డు ప్రతిపాదనలు రూపొందించారు. దీనికోసంగాను 35 కోట్ల రూపాయల వ్యయంతో నాలుగు లైన్ల రోడ్డును నిర్మి ంచాలని తలపెట్టారు. ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ ప్రతిపాదనలను గత రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వానికి నివేదించారు. జిల్లాకే చెందిన అప్పటి రాష్ట్ర అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సైతం ఈ ప్రతిపాదనలపై సీరియస్‌గా దృష్టి సారిస్తానని అవసరమైతే సీఎం ము ఖ్యమంత్రి దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకువెళ్తానని అప్పట్లో ప్రకటిం చారు. ఈ ప్రతిపాదనలకు అప్పటి ప్రభుత్వం పరిశీలనకు తీసుకున్నప్పటికీ నిధులు విడుదల విషయంలో మాత్రం పట్టించుకోలేదు. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రింగ్ రోడ్డుకు సంబంధించి నిధులు విడుదల చేసి ఉన్నట్లయితే నిర్మల్ చుట్టూ ఉన్న దూర ప్రాంతపు ప్రజలందరికీ టౌన్‌కు చేరుకునేందుకు ఎంతో సులువయ్యేది. అలాగే కమ్యూనికేషన్ వ్యవస్థ మరింత విస్తరించేందుకు రింగ్ రోడ్డు తోడ్పడేదంటున్నారు.

నాలుగు వైపులా నిర్మాణ ప్రతిపాదనలు

నిర్మల్ చుట్టూ ఉన్న అన్ని గ్రామాలను కలుపుతూ నలుగు వైపులా ఈ రింగ్ రోడ్డును నిర్మించాలని తలపెట్టారు. రాణాపూర్ నుండి మొదలుకొని ఎల్లారెడ్డిపేట, పులిమడుగు, సీలాయిపేట, కిషన్ రావుపేట, న్యూ పోచంపాడ్ మీదుగా అక్కాపూర్, కడ్తాల్, కొట్ల(కే), చిట్యాల వరకు ఈ రోడ్డును చేపట్టాలని ప్రతిపాదించారు. అలాగే ఇక్కడి నుండి మళ్లీ లంగ్డాపూర్, తల్వేద, ఆలూర్, లక్ష్మీపూర్ మీదుగా రాణాపూర్ వరకు ఈ రింగ్ రోడ్డును ప్రతిపాదిస్తున్నారు. ఈ రింగ్ రోడ్డును పులిమడుగు నుండి కడ్తాల్ వరకు నేషనల్ హైవే నెంబర్ 44కు లింక్ చేయనున్నారు. అలాగే నిర్మల్ గుండా వెళ్లే మూడు హైవేలను కూడా ఈ రింగ్ రోడ్డుతో లింక్ చేయబోతున్నారు.

కొత్త సర్కారు హయాంలో సాధ్యమయ్యేనా?

జిల్లా కేంద్రమైన నిర్మల్ పట్టణంలో ప్రతీరోజు ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. రెండు జాతీయ రహదారులకు ఆనుకొని ఉన్న ఈ పట్టణంలోకి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వాహనాలలో రావాలంటే చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలోని నాలుగు వైపులా చాలా గ్రామాలు ఉండడం, ఆ గ్రామాల ప్రజలంతా ప్రతీ పని కోసం నిర్మల్ కేంద్రానికి వస్తుండడం సహజం. దీంతో నిర్మల్ పట్టణం రద్దీగా మారిపోతోంది. అయితే ఓవైపు నుండి మరోవైపు గల గ్రామాలకు వెళ్లేందుకు వారంతా నిర్మల్ పట్టణం మీదుగానే వెళ్లాల్సి వస్తోంది. రింగు రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామాల ప్రజలు పట్టణంలోకి రావలసిన అవసరం ఉండదంటున్నారు. పట్టణం బయట నిర్మించిన రింగ్ రోడ్డు గుండానే వారంతా తమ గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఏర్పడుతుందని చెబుతున్నారు. కాగా గత ప్రభుత్వం రింగ్ రోడ్డు నిర్మాణ ప్రతిపాదనను పక్కన పెట్టడం పట్ల అనేక విమర్శలు వెల్లువెత్తాయి. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఈ రింగ్ రోడ్డు ప్రతిపాదనలకు మోక్షం కల్పించాలని కోరుతున్నారు.



నిర్మల్ మండలం కొట్ల(కే) గ్రామం ఇదే..



చిట్యాల గ్రామం నుంచి కొట్ల(కే) గ్రామం వైపు వెళ్తున్న రోడ్డు..



నిర్మల్ మండలంలోని న్యూ పోచంపాడ్ గ్రామం ఇదే..



నిర్మల్ మండలం 61వ జాతీయ రహదారి నుంచి అక్కాపూర్ గ్రామం వైపు వెళ్తున్న రహదారి ఇదే..

భూభారతి పైలట్ ప్రాజెక్టుకు కుంటాల మండలం ఎంపిక

- 16 గ్రామాల్లో ఈనెల 5 నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు: కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): భూ భారతి నూతన రెవెన్యూ చట్టం అమలులో భాగంగా కుంటాల మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మండలంలోని 16 గ్రామాల్లో ఈ నెల 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు మూడు ప్రత్యేక బృందాలను నియమించామని తెలిపారు. భూములకు సంబంధించిన సమస్యలు, పాత రికార్డుల సమస్యలు, పేరు మార్పులు వంటి అంశాలను స్థానిక ప్రజలు ఈ సదస్సుల్లో దరఖాస్తుల రూపంలో ఇవ్వవచ్చని సూచించారు. ప్రతీరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. జూన్ 2వ తేదీ వరకు పైలట్ ప్రాజెక్టు కింద అందిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు నిరంతరం కృషి చేయాలని, అవసరమైన కార్యాచరణను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. భూభారతి అమలుతో ప్రజలకు తక్షణ సత్వర సేవలు అందేలా చర్యలు చేపడతామని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పాము కాటుతో మహిళ మృతి



రజిత మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

కడెం, మే4 (ఆంధ్రజ్యోతి): పాము కాటుతో ఓ మహిళా మృతిచెందిన ఘటన కడెం మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. పెద్దూర్ గ్రామానికి చెందిన నేరెళ్ల రజిత (30) ఆదివారం ఉదయం ఇంటి సమీపంలో తోట కూర కోస్తుండగా పాముకాటుకు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

- బాధిత కుటుంబానికి అండగా ఉంటాం: ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న నాయకులు

పాము కాటుకు గురై నేరెళ్ల రజిత మరణించిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కి విషయం చెప్పడంతో తక్షణ సహాయంగా ఆర్థిక సహాయం చేశారు. ఆ కుటుంబానికి పెద్దూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, పిల్లలపై చదువులకి తనవంతుగా బాధ్యత తీసుకుంటానని నాయకులతో మాట్లాడారు. మృతి చెందిన నేరెళ్ల రజిత భర్తని, కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం తరుపున అండగా ఉంటామని మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగెల భూషణ్ అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, జిల్లా నాయకులు పొద్దుటూరి సతీష్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వాజీద్ ఖాన్, బుర్ర దేవేందర్‌గౌడ్, సత్యం చారి, జడ రాజేశ్వర్, తోట్ల గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు



కల్యాణంలో తరలివచ్చిన భక్తులు

నిర్మల్ రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని హరిహరక్షేత్రం మల్లన్న గుట్టయందు శనివారం రాత్రి సుబ్రహ్మణేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కోశాధికారి వేణు గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ మురళీధర్‌రెడ్డి దంపతుల సహకారంతో ఆలయ గురుస్వామి మూర్తి ఆధ్వర్యంలో నిజామాబాద్ నుంచి విచ్చేసిన వేద పండితులచే సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి పట్టణ ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు బద్రి శ్రీనివాస్, సాయి, యువరాజ్, దేవేందర్ రెడ్డి, సంతోష్, భక్తులు పాల్గొన్నారు.



వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు



హుండీలో వచ్చిన డబ్బులను లెక్కిస్తున్న దృశ్యం

ముథోల్, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గల వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపును గ్రామ స్థులు నిర్వహించారు. రూ.51,600 వచ్చినట్లు తెలిపారు. ఒక ఏడాదికి సంబంధించిన హుండీ లెక్కింపని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు సురేష్ గౌడ్, రమేష్ గౌడ్, రాములు, రాజు, భోజేందర్, గంగాధర్, శ్రీనివాస్, ముత్యం, దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడే వారికే పదవులు

- ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్



మాట్లాడుతున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్



భైంసా పట్టణాధ్యక్షుడు రావుల రామును సన్మానిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

భైంసా,మే4 (ఆంధ్రజ్యోతి): బాధ్యతాయుతమైన విధానాల ద్వారా పార్టీ కోసం పనిచేసే బీజేపీ శ్రేణులకు పదవుల పట్టం కడుతామని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ వెల్లడించారు. ఆదివారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో భైంసా టౌన్, కుంటాల మండలాలకు నూతనంగా నియమితులైన బీజేపీ అధ్యక్షులు రావుల రాము, పసుల నవీన్, పలువురు జిల్లా కార్యవర్గ సభ్యులకు పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ కోసం పనిచేసే వారందరికి సందర్భానుసారంగా సముచిత స్థానం కల్పిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు మండల, జిల్లా కార్యవర్గాలు, వివిధ మోర్చాలలో ప్రాధాన్యతనివ్వనున్నామని పేర్కొన్నారు. నూతనంగా పదవులు అలంకరించిన ప్రతినిధులు పార్టీ శ్రేణులన్నింటిని సమన్వయం చేసుకొని సమిష్టిగా కృషి చేసి బీజేపీని పూర్తిస్థాయిలో బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్,స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయబేరి మోగించేందుకు ఇప్పటినుంచే సమయాత్తం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ ప్రతినిధులు తమ తమ ప్రాంతాల్లో నెలకొని ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకవస్తే వాటిని పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని తెలిపారు. ప్రాధాన్యతననుసరిస్తూ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికబద్దంగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ముథోల్‌ను ఆదర్శ నియోజక వర్గంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఇందులో భైంసా పట్టణ, మండల, కుంటాల మండల బీజేపీ శ్రేణులు, ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



చేతిలో కర్ర పట్టుకొని గస్తీ కాస్తున్న గ్రామస్థులు

కొట్ల(కే)లో దొంగల అలజడి

- భయంతో గ్రామస్థుల గస్తీ

నిర్మల్ రూరల్, మే4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొట్ల(కే) గ్రామంలో దొంగలు ప్రయాణికులకు, గ్రామస్థులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా కెనాల్ పక్కన ఉన్న రైతుల మోటార్లు, కల్లాల్లో ఉన్న వరి ధాన్యం దొంగతనం చేయడం, అలాగే నిర్మల్ నుంచి లోకల్ వ్మెల్ వెళ్లే రహదారిపై డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ప్రాంతంలో ఆటోలలో, ద్విచక్ర వాహనాలపై వెళ్లే ప్రయాణికులను బెదిరించి చైన్‌స్నాచర్ల దొంగతనాలు జరుగుతున్నాయి. దీంతో గ్రామస్థులు ఆందోళనకు గురుతున్నారు. దీంతో గ్రామంలోని వీడీసీ ఆధ్వర్యంలో పోలీసుల సహకారంతో రాత్రి 7గంటల నుంచి గ్రామస్థులే స్వయంగా గస్తీ కాస్తున్నారు. కర్రలు చేత పట్టుకొని రాత్రంతా తిరుగుతున్నారు. ఇలా వంతుల వారీగా యువకులు గస్తీ కాస్తున్నారు.

మైనార్టీ బాలికల రెసిడెన్షియల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ముథోల్, మే4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ మైనార్టీ బాలికల రెసిడెన్షియల్‌లో ఇంటర్మీడియట్ ప్రవేశానికి 2025-26కు గాను ఆసక్తి గల విద్యార్థినిలు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అర్జుమన్ నాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉచిత నాణ్యమైన విద్య, భోజనం, యూనిఫామ్, ల్యాబ్ సౌకర్యం, ఉచిత పుస్తకాలు, నోట్ బుక్‌లతోపాటు ఉచిత నీట్ కోచింగ్ కలదని తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ కోర్సులలో ప్రవేశాలు కలవని తెలిపారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నిర్మల్ రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఆర్ పాఠశాలలో 10వ తరగతి చదివిన 2001- 2002 బ్యాచ్ విద్యార్థులు పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 23 ఏళ్ల తర్వాత విద్యార్థులు అంతా పట్టణంలోని ఓ హాల్‌లో కలుసుకున్నారు. ఆదివారం నిర్వహించిన ఈ పూర్వవిద్యార్థులు సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు. తమ చిన్ననాటి మధుర జ్ఞాపకాలను మిత్రులు అంతా గుర్తు చేసుకుంటూ సరదాగా గడిపారు. ఉపాధ్యాయులు నర్సింగ్‌రావు, తిరుపతిరెడ్డి, దయాకర్ రావు, దేవన్న, భూమన్న, రాజన్న, వినోద్, రాధాకృష్ణ, సురేష్, శ్రీనివాస్, నర్సయ్య, శ్రీనివాస్, గౌడ్, ఆనంద్, నర్మద, తదితరులు పాల్గొన్నారు.



వేదికపై 2001-2002 బ్యాచ్ విద్యార్థులు



ఆలయం వద్ద భక్తుల రద్దీ

అడెల్లి పోచమ్మకు ప్రత్యేక పూజలు

సారంగాపూర్, మే4 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ మండలంలోని ప్రసిద్ధిగాంచిన అడెల్లి పోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి మొక్కులను మొక్కి పెరగన్నం నైవేద్యంగా సమర్పించారు. ఆలయానికి మొక్కులను తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కోకుండా ఉండడానికి ఆలయ ఇంచార్జీ ఈవో రమేష్ అన్ని ఏర్పాట్లు చేశారు. మొక్కులు తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు జాతకాలను సరిచూసుకున్నారు. ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో ఆలయానికి మొక్కులు తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అలాగే ఆలయం వద్ద తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకున్నారు. నిర్మల్, భైంసా డిపోల నుంచి అధికసంఖ్యలో బస్సు సౌకర్యాలను కల్పించారు. దీంతో పాటు అధికసంఖ్యలో ప్రైవేటు వాహనాలలో భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి రావడంతో భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొకుండా ఉండడానికి ఎస్సై శ్రీకాంత్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ఆలయం వద్ద ట్రాఫిక్‌జామ్ కాకుండా వెంటది వెంట చర్యలు తీసుకున్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

పెంబి, మే 4 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామసమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో లోతర్య తండాకు చెందిన బాణావత్ అశ్విని, మంజుల మృతిచెందటం బాధాకరమని ఖానాపూర్ నియోజకవర్గ శాసన సభ్యులు వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం పెంబి మండలంలోని లోతర్య తండాకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బంగారు భవిష్యత్తు ఉన్న విద్యార్థులు ఇలా మధ్యంతరంగా మరణించడం తనను తీవ్రంగా కలచివేసింద న్నారు. ప్రభుత్వపరంగా బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి, ఉపాధి అవకాశం కల్పించేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నల్ల స్వప్నిల్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల శంకర్, కాంగ్రెస్ నాయకులు తులాల శంకర్, రమేష్, మహేందర్, నాయకులు, తదితరలు ఉన్నారు.

పేదింటి బిడ్డ వివాహానికి ఆర్థికసాయం

ఉట్నూర్, మే4 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని చాందూరి గ్రామానికి చెందిన షేక్ దిల్దార్ కుమార్తె వివాహం కోసం వెడ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆదివారం వెడ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఖానాపూర్ నియోజక వర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జు పటేల్ ఆదేశాలతో రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందించామని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఇది ఇలా ఉండగా ఉట్నూర్ మండలంలోని వడోని గ్రామానికి చెందిన సుందర్‌బాయి చేయి ప్రమాదవ శాత్తు తీవ్రంగా గాయపడడంతో ఆర్థిక సహాయం కోరగా రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో వెడ్మఫౌండేషన్ వైస్ చైర్మన్ కోరెంగ అక్షయ్, సభ్యులు మేస్రం నగేష్ తదితరులు పాల్గొన్నారు.

'షార్ట్‌సర్క్యూట్‌తో నష్టపోయిన బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం'

భైంసా, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేగాం గ్రామంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా నష్టాల పాలైన బాధిత కుటుంబానికి బాసటగా నిలుస్తామని మోహన్‌రావ్ ప్రజా ట్రస్టు చైర్మెన్ బోస్లే మోహన్‌రావ్ పాటిల్ పేర్కొన్నారు. ఆదివారం దేగాం గ్రామంలో బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ట్రస్టు తరపున రూ.10వేల ఆర్థిక సహాయాన్ని, నిత్యావసర సరుకులను అందచేశారు. ఈ సందర్భంగా బోస్లే మోహన్‌రావ్ పాటిల్ మాట్లాడుతూ షార్ట్ సర్క్యూట్ కారణంగా వ్యాపించిన మంటలతో బాధిత కుటుంబీకుల నిత్యావసర సరుకులతో పాటు దాచుకున్న నగదు, పలు అభరణాలు అన్నీ అగ్ని ఆహుతయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వం కోల్పోయి కష్ట, నష్టాల పాలైన బాధిత కుటుంబానికి ట్రస్టు తరఫున అవసరమైన అన్నిరకాల తోడ్పాటు నిస్తామని వెల్లడించారు. ఇందులో ట్రస్టు ప్రతినిధి ముత్యంరెడ్డితో పాటు దేగాం గ్రామసులు పాల్గొన్నారు.



భైంసాలోని విద్యుత్ సబ్‌స్టేషన్



దేగాంలో గల సబ్‌స్టేషన్



విద్యుత్ తీగలకు తాకుతున్న కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

విద్యుత్ శాఖలో ప్రీమాన్‌సూన్ చెకప్

• తీగలను తాకుతున్న చెట్టు కొమ్మల తొలగింపులు • వేలాడుతున్న విద్యుత్ తీగల బిగింపు • సరఫరాలోని అటంకాలు, అంతరాయలను అధిగమించేందుకు ముమ్మరంగా చర్యలు

భైంసా, మే 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సరఫరా వ్యవస్థకు ఎలాంటి ఆటంకాలు, అంతరాయలు ఏర్పడకుండా ఉండేందుకు ట్రాన్స్‌కో అధికారుల ఆధ్వర్యంలో జిల్లాలో ప్రీమాన్‌సూన్ చెకప్ చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. జిల్లాలో ఎస్ఈ సుదర్శనం, భైంసా డివిజన్ పరిధిలో డీఈశ్రీనివా శ్రీనివాస్ రెడ్డి, ఏడీఈ ఆదిత్య, ఏఈ మోహన్ కుమార్ సారథ్యంలో ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్ల వారీగా సరఫరా వ్యవస్థ మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ వేసవి కాలంలో విద్యుత్ శాఖ ప్రీ మాన్‌సూన్ చెక్‌అప్ కార్యక్రమాన్ని ప్రణాళికా బద్ధమైన చర్యలతో పకడ్బందీగా నిర్వహిస్తోంది.

• జిల్లాలో 90 విద్యుత్ సబ్‌స్టేషన్లు

జిల్లాలోని భైంసా, నిర్మల్ విద్యుత్ డివిజన్‌ల పరిధిలో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు 90 ఉన్నాయి. ఇందులో భైంసా డివిజన్ పరిధిలో 30 విద్యుత్తు సబ్‌స్టేషన్లు ఉండగా మిగతావన్నీ నిర్మల్ డివిజన్ పరిధిలో ఉన్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకు అవసరమైన మరమ్మతు చర్యలను ప్రీ మాన్‌సూన్ సూన్ చెకప్ పేరిట నిర్వహిస్తున్నారు. ఇదివరకే సంబంధిత విషయమై లోపాలను తెలుసుకునేందుకు పూర్తి స్థాయి సర్వే నిర్వహించిన అధికారులు ప్రస్తుతం వ్యవస్థ మెరుగుదలకు చర్యలకు కసరత్తులు చేపట్టారు ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వేళ వరకు ఆయా ప్రాంతాల సబ్‌స్టేషన్ల విద్యుత్ సిబ్బంది గ్రూపులుగా విడిపోయి ప్రీ మాన్‌సూన్ చెకప్ కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా విద్యుత్ సబ్ స్టేషన్ల ఇంజనీరింగ్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ నిర్వహణ వ్యవస్థను పర్యవేక్షిస్తున్నారు.



తీగలను తాకుతున్న కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

• లోపాల తొలగింపునకు ముమ్మరంగా చర్యలు

ప్రీ మాన్‌సూన్ చెకప్‌లో భాగంగా అన్నిప్రాంతాల్లో విద్యుత్ తీగలకు తగిలే స్థితిలోనున్న చెట్టుకొమ్మలను తొలగింపచేస్తున్నారు. వేలాడుతున్న విద్యుత్ తీగలను బిగుతూ చేస్తున్నారు. దుస్థితిలోనున్న విద్యుత్ స్తంభాల ఇన్సులేటర్లను తొలగించి కొత్త వాటిని అమర్చే పనులను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నిర్వహణ వ్యవస్థ మెరుగుదలకు అవసరమైన మార్పులు, చేర్పులు చేపడుతున్నారు. చెడిపోయిన ఫ్యూజ్ బాక్స్‌లను తొలగించి వాటి స్థానాల్లో కొత్త వాటిని అమర్చుతున్నారు. బలహీనంగా మారిన విద్యుత్ తీగల స్థానాల్లో సామర్థ్యం గల తీగలను బిగిస్తున్నారు లూజ్ కనెక్షన్స్‌ను బిగుతూ చేస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రీ మాన్‌సూన్ చెక్‌అప్ కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయి. తద్వారా రాబోయే వర్షాకాలంలో విద్యుత్ సరఫరా వ్యవస్థకు ఎలాంటి ఆటంకాలు, అంతరాయాల ఏర్పడకుండా ఉండేందుకు గాను ప్రణాళికాబద్ధమైన విధానాల ద్వారా లోపాలను సవరించే చర్యలు తీసుకుంటున్నారు.

అంతరాయం లేని సరఫరాకు పకడ్బందీ చర్యలు

• శ్రీనివాస్‌రెడ్డి, డీఈ, భైంసా డివిజన్

ప్రణాళికాబద్ధమైన విధానాల ద్వారా అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాను అందించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాం. ఎస్ఈ సుదర్శనం ఆదేశాలకు అనుగుణంగా సరఫరా వ్యవస్థకు ఆటంకంగా ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరింపచేస్తున్నాం. క్షేత్రస్థాయిలో విస్తృత పర్యటనలు చేపడుతూ లోపాలను సవరిస్తున్నాం. విద్యుత్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరిస్తూ విద్యుత్ వినియోగదారులకు అంతరాయం లేకుండా సరఫరా అందించే దిశగా చర్యలు ముమ్మరం చేశాం.

ఐక్యంగా ఉంటే ఏదైనా సాధ్యం

• బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



వెంకటాపూర్‌లో లింబా మహరాజ్‌తో కలిసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే



లింబా మహరాజ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నేరడిగొండ, మే 4 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థులు ఐక్యంగా ఉంటే ఏదైనా సాధ్యపడుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మం డలంలోని వెంకటాపూర్ గ్రామంలో గల జగజ్జనని జగదాంబ దేవిసంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ ఆలయంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లింబాజీ మహరాజ్‌తో కలిసి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ గ్రామమంతా ఏకమై దైవ భక్తిలో భాగంగా విగ్రహాలను తీసుకురావడం గ్రామానికి మంచి చేకూరుతుందని అందరూ కలిసి ఉంటే ఇలా ఏదైనా సాధ్యమవుతుందని అన్నారు. లింబా మహారాజ్ మాట్లాడుతూ గ్రామాలలో గల ఆలయాల్లో ప్రతీ నిత్యం పూజలు చేయడం ద్వారా కుటుంబాలు అన్నికాకుండా గ్రామాల్లో సైతం సుఖశాంతులు నెలకొంటాయని అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, ప్రీతం రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ దేవేందర్‌రెడ్డి, గ్రామ పెద్ద గంగారాం నాయ క్, తుకారం నాయక్, ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు, వేద పండితులు రాజు తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు సలహాలు అందజేయాలి

పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు సలహాలు అందజేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని చిన్న బుగ్గారం గ్రామానికి చెందిన రాథోడ్ ఉత్తమ్ పదవీ విరమణ పొందిన సందర్భంగా బుగ్గారం గ్రామంలో నిర్వహించిన సన్మాన సభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, రాథోడ్ ఉత్తమ్ దంపతులకు శాలువాతో సన్మానించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ చిన్న గ్రామమైన బుగ్గరాం నుంచి అనేక మంది పట్టుదలతో ఉద్యోగాలు సాధించడం గొప్ప విషయమని ఉద్యోగ విరమణ పొందిన సైతం విద్యార్థులకు సూచనలు అందజేయాలని వారి భవిష్యత్తు నిర్మాణానికి తోడ్పాటు అందజేయాలని అన్నారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ రాథోడ్, జైసింగ్, లెక్చరర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ బలిరామ్, పీజీ హెచ్ఎం అంబారావు, ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉత్తమ్‌రావు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌లో 15 మంది జూదరుల అరెస్టు

ఆదిలాబాద్ రూరల్, మే4 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మినీ బాలాజీ ఫంక్షన్ హాల్ వద్ద పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 15 మందిని పట్టుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఫణిదర్ తెలిపారు. వారి వద్ద నుంచి పేకాట ముక్కలు, రూ.89,160 నగదు, 13 మొబైల్ ఫోన్‌లు, 6 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తలిపారు. మంద అడెల్లు, శ్రీరాం సంతోష్, బర్కుంటి రాజు, చిట్యాల సంజీవ్, బోనగిరి గంగన్న, ఏకొండి గంగారెడ్డి, కోల భోజన్న, మెంతపు మహేష్, ఇనేని కిరణ్, బొల్లు నరేష్, ఆంజినేని దినకర్, తింగేని పోచన్న, ఆకుల సాయి, గుంజెల ప్రద్యుమ్నుడు, రౌతు సతీష్ పట్టుబడ్డారని తెలిపారు. వీరిపై ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు యువత అసాంఘిక కార్యకలాపాలకు, చట్ట వ్యతిరేక పనులకు, వ్యసనాలకు పాల్పడకూడదని కోరారు.

'డబ్బులు వసూలు చేసిన వ్యక్తులతో పార్టీకి సంబంధం లేదు'

ఆదిలాబాద్‌రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బెదిరింపులకు పాల్పడ్డ యువకులకు తమ పార్టీతో ఎటువంటి సంబంధమూ లేదని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఫయాజ్ హష్మి అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కూల్ యాజమాన్యాన్ని బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన యూసుఫ్, అర్షద్, సమద్ అనే వ్యక్తులు తమ పార్టీకి సంబంధించిన వారు కాదని, ప్రజలు దీన్ని గమనించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. పార్టీ పట్టణ కమిటీని సైతం రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం : కేసు నమోదు

తానూర్, మే4: (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలూరుకు చెందిన గోనెవాడ్ సాయినాథ్ అదృశ్యం అయినట్లు ట్రైనీ ఎస్సై నవనీత్ తెలిపారు. వివరాల ప్రకారం.. సాయినాథ్ అనారోగ్యం బాగా లేకపోవడంతో గతనెల ధర్మాబాద్ లోని హాస్పిటల్‌కి వెళ్లగా అక్కడి వైద్యులు హైదరాబాద్ వెళ్లాలని చెప్పడంతో శనివారం హైదరాబాద్‌కు బయల్దేరాడు. అయితే సాయినాథ్ ఎక్కడి వరకు వచ్చాడో తెలుసుకునేందుకు అతని కుమారుడు ప్రశాంత్ ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. ఎన్నిసార్లు చేసినా ఫోన్ కలవలేదు. దీంతో ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని తన బంధువులకు ఫోన్ చేయగా తమ వద్దకు రాలేదని చెప్పడంతో ప్రశాంత్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ట్రాక్టర్ బోల్తా



విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడ్డ ట్రాక్టర్

దిలావర్‌పూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డును ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన గుండంపల్లి రోడ్డుపై ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండంపల్లికి చెందిన ట్రాక్టర్ నల్ల మట్టి లోడుతో పంట చేలకు వెళ్తుండగా టెంబుర్ని వైకుంఠధామం వద్ద అదుపు తప్పి పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. స్తంభం విరిగి విద్యుత్ తీగలు వేలాడాయి. ట్రాక్టర్ డ్రైవర్ తృటిలో తప్పించుకుని ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేశారు.



కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు

మరింత స్మార్ట్‌గా ఆర్టీసీ సేవలు

• పెరుగుతున్న సాంకేతిక విధానాలు • కీచైన్లపై సంస్థ యాప్‌ల క్యూఆర్ కోడ్ • స్కాన్ చేస్తే సంస్థ పూర్తి వివరాలు, సేవలు ప్రత్యక్షం

భైంసా, మే 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సాంకేతిక పరిజ్ఞానపు విధానాల ద్వారా ప్రయాణికులకు స్మార్ట్ సేవలు అందుబాటులోకి తీసుకు వస్తోంది. దశలవారీగా ఒక్కో విధానాన్ని అమలులోకి తీసుకువస్తూ ప్రయాణికులకు చేరువయ్యే దిశగా పయనిస్తోంది. ఒకవైపు ప్రయాణికులకు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తూ మరోవైపు మెరుగైన రీతిలో అధునాతన సేవలను ప్రయాణికులకు చెంతకు తీసుకు వస్తోంది. ఇప్పటికే చిల్లర కొరతను అధిగమించేందుకు నగదు రహిత సేవలను అందుబాటులోకి తీసుకవచ్చే చర్యలు వేగవంతం చేసిన ఆర్టీసీ ప్రస్తుతం క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా సంస్థ సేవలను ప్రయాణికులకు మరింత సులభతరం చేసింది. ప్రగతి రథం.. ప్రజాసేవా పథం అనే నినాదంతో ప్రయాణికులకు చేరువవుతూ నష్టాలను అధిగమిస్తూ లాభాలబాటలోకి పయనిస్తోంది.

• పది యాపుల ద్వారా సంస్థ సేవలు

ఆర్టీసీ ప్రస్తుతం పది యాపుల ద్వారా ప్రయాణికులకు ఆధునిక సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఇందుకోసం క్యూఆర్ కోడ్‌తోనున్న కీచైన్లను అందుబాటులోకి తీసుకు వచ్చింది. స్కాన్ చేస్తే ఆర్టీసీ సేవలకు సంబంధించిన పూర్తివివరాలను ప్రత్యక్షం కానున్నాయి. ప్రస్తుతం స్మార్ట్ ఫోన్ వినియోగం అన్నివర్గాలు, రంగాల్లో ప్రధానంగా మారింది. అర చేతిలో సమాచారం అంతా ఉన్నట్లే. సంస్థ రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్ ఫోన్‌లో స్కాన్ చేయగానే స్క్రీన్‌పై సంస్థ అందించే సేవలు ప్రత్యక్షమవుతాయి. ఇందులో పది రకాలయాప్‌ల ద్వారా అన్నిసేవల వివరాలు అందనున్నాయి. గమ్యం యాప్ ద్వారా మనం ప్రయాణించాల్సిన బస్సు వివరాలు, సమయం తదితర సేవలు అందుబాటులో ఉంటాయి. ఆన్‌లైన్ బస్‌టికెట్ బుకింగ్ వెబ్‌సైట్, బుకింగ్ యాప్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, ఫేస్‌బుక్, వాట్సప్ ఛానల్, యూట్యూబ్ లాంటివి కనిపిస్తాయి. సంబంధిత ప్రక్రియలో మెయిల్ ఐడీ, పాస్‌వర్డ్ సాయంతో మన వివరాలు పొందుపరిస్తే వినియోగించడం సులభతరమవుతుంది. సలహాలు, సమస్యలపై సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. అంతేకాకుండా శుభకార్యాలతో పాటు విహార యాత్రలకు బస్సులను రాయితీ విధానంలో బుక్ చేసుకునే విధానం అందుబాటులో ఉంది.



భైంసా బస్టాండ్‌లో బస్సు వద్ద ప్రయాణికులు

• క్యూఆర్ కోడ్ కీ చైన్ల పంపిణీ

క్యూఆర్ కోడ్‌తో రూపొందించిన కీ చైన్లను సంస్థ రీజన్, డిపోల వారీగా సరఫరా చేపట్టింది. ప్రస్తుతం డిపో నిర్వహణ అధికారులు సంస్థ అందచేసిన కీచైన్లను పంపిణీని ఆయా ప్రభుత్వశాఖల అధికారులకు, ప్రజాప్రతినిధులకు, ప్రముఖులకు పంపిణీ చేసింది. సందర్భానుసారంగా ప్రయాణీకులకు సైతం అందచేస్తోంది.



ఆర్టీసి రూపొందించిన క్యూ అర్ కోడ్ కీ చైన్లు

• ఇలా వినియోగం

కీచైన్లపై రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను గూగుల్ ఓపెన్ చేసి అందులో పైన కనిపిస్తున్న కెమెరాపై క్లిక్ చేయాలి. అనంతరం కీచైన్‌పై రూపొందించిన క్యూఆర్ కోడ్ (క్విక్ రెస్పాన్స్)ను స్కాన్ చేయాల్సి ఉంటుంది. తద్వారా మనకు కావాల్సిన సంస్థ సేవల వివరాలన్నీ ప్రత్యక్షమవుతాయి.

ఆదమరిస్తే అంతే సంగతులు



వరి పంట కోస్తున్న హార్వెస్టర్

నర్సాపూర్(జి), మే 4 (ఆంధ్రజ్యోతి) : యాసంగి వరి కోతలు ఊపందుకున్నాయి. కూలీల కొరత నేపథ్యంలో జిల్లాలో అన్నదాతలు వరి పంట కోయడానికి కోత యంత్రాలు హార్వెస్టర్‌పై ఆధారపడక తప్పని పరిస్థితి ఏర్పడింది. కాగా హార్వెస్టర్లు నడిపే పలువురు ఆపరేటర్ల అజాగ్రత్త ప్రతీయేట ప్రమాదాలకు కారణమవుతోంది. ఈ సంఘటనల్లో కొందరు ప్రాణాలు కోల్పోతుండగా మరికొందరు అంగవైకల్యంతో జీవితాంతం బాధపడుతున్నారు. ఆపరేటర్ల కొరత వల్ల ఎక్కువ గంటలు విశ్రాంతి లేకుండా పని చేయడం వలన కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ, అగ్నిమాపక, రవాణా శాఖ అధికారులు హార్వెస్టర్ల యజమానులు ఆపరేటర్లకు నిబంధనలు రక్షణ చర్యలపై సీజన్ ఆరంభం ముందే అవగాహన కల్పిస్తే ప్రమాదాలు నివారించే అవకాశం ఉంది.

ఆపరేటర్లు పాటించాల్సిన జాగ్రత్తలు

- హార్వెస్టర్ విడి భాగాలు సరిగ్గా పని చేస్తున్నది లేనిది పొలంలోకి దిగకముందే సరిచూసుకోవాలి.
- పని లేనప్పుడు వాళ్ల ప్రదేశాల్లో నిలిపి ఉంచడం, టైర్ల కింద రాళ్లు అడ్డుపెట్టడం ప్రమాదకరం.
- యంత్రం మరమ్మతుకు గురైతే నిపుణులతో తనిఖీ చేయించాలి.
- కన్వేయర్ బెల్ట్ వంటి భాగాలు మరమ్మతులు చేయాల్సి వస్తే అత్యంత జాగ్రత్తతో వ్యవహరించాలి.
- వర్షం, పొగ మంచు సమయాల్లో పొలంలో నీళ్లు ఎక్కుగా ఉన్నప్పుడు కోత పనులు చేయవద్దు.
- ఇంజన్ స్విచ్ ఆఫ్ చేయకుండా ఏ పని చేయొద్దు.
- బురద ఉన్నప్పుడు కోత పనులు చేస్తే యంత్రాలు అందులో కూరుకునే ప్రమాదం ఉంది.

రైతులు, కూలీలు పాటించాల్సినవి

హార్వెస్టర్ వెనుక భాగం ఆపరేటర్‌కు కనిపించదు. కోత కోసే సమయంలో ముఖ్యంగా చిన్న పిల్లలు, దివ్యాంగులు యంత్రాల వద్దకు వెళ్లవద్దు.

- హార్వెస్టర్ కదులుతున్నప్పుడు ఎక్కడం, దిగడం చేయవద్దు.
- రహదారులు పొలాల్లో అడ్డువచ్చే కరెంటు తీగలను ఎండిన కర్ర లేదా రబ్బరు ప్లాస్టిక్ సాధనాలతో పక్కకు తొలగించాలి.
- యాసంగి కోతల సమయంలో యంత్రాల వద్ద అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలి.

పరీక్ష కేంద్రాల వివరాలను తెలుసుకుంటున్న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్



ఫొటో న్యూస్

ప్రశాంతంగా నీట్

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో నీట్ 2025 ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగింది.



హాల్ టికెట్లను చూసుకుంటున్న అభ్యర్థులు





అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న పోలీసులు



జాతీయ రహదారి 61పై మట్టి లోడుతో వెళ్తున్న టిప్పర్లు



భారీ వాహనాలతో దెబ్బతిన్న గుండంపల్లి - దిలావర్‌పూర్ రోడ్డు

కాసులు కురిపిస్తున్న 'నల్ల' మట్టి దందా



టరాస్‌లో పరిమితికి మించి నల్ల మట్టి లోడింగ్ చేసిన దృశ్యం

- రైతుల పేరుతో వ్యాపారం ● పరిమితికి మించి లోడింగ్ ● ధ్వంసమవుతున్న రోడ్లు
- మట్టి పడి ప్రమాదకరంగా మారుతున్న జాతీయ రహదారి

దిలావర్‌పూర్, మే 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నల్ల మట్టి వ్యాపారం అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. నిత్యం వందలాది టిప్పర్లు, టరాస్‌లలో నల్ల మట్టి జిల్లా సరిహద్దులు దాటి వెళ్తోంది. రైతుల పేరుతో నల్ల మట్టి దందా చేస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు.

నల్ల మట్టికి డిమాండ్ ఎందుకు..!?

నల్ల మట్టి చాలా సారవంతమైంది. ఇది సాగు భూమికి పుష్టినిచ్చి పంటల దిగుబడికి దోహద పడుతుంది. సాధారణంగా ప్రతియేటా రైతులు తమ గ్రామాల్లో ఉన్న చెరువు నుంచి నల్ల మట్టిని తీసి ట్రాక్టర్‌లలో తమ పంట పొలాల్లో వేస్తారు. నల్ల మట్టిలో పంటల ఎదుగుదలకు అవసరమైన ఖనిజ లవణాలు, పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అందుకే రైతులు ఖరీఫ్ సాగుకు ముందు చెరువుల నుంచి నల్లమట్టి తరలించి పంట చేలలో వేసుకుంటారు. గోదావరి మట్టి అయితే చెప్పనవసరం లేదు. మట్టి సారవంతమైనదే కాకుండా ఈ మట్టి భూమిని వదులుగా ఉంచి పంట వేర్లు భూమిలోనికి చొచ్చుకు వెళ్లేందుకు దోహదం చేస్తుంది. అందుకే నల్లమట్టికి డిమాండ్ ఉంటుంది.

గోదావరి మట్టికి రూ. వేలల్లో ధర

దిలావర్‌పూర్ మండలం గోదావరి నది పరివాహక ప్రాంతాన్ని ఆనుకుని ఉంది. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఉమ్మడి దిలావర్‌పూర్ మండలంలోని నర్సాపూర్(జి), టెంబుర్ని, సముందర్‌పల్లి, రత్నాపూర్ కాండ్లి, బన్సపల్లి, కంజర్, సాంగ్వి గ్రామాల శివార్లను ఆనుకుని ఉంటుంది. ఈ ఏడాది ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఎండిపోవడంతో సారవంతమైన నల్ల మట్టి లభ్యమవుతోంది. దీంతో స్థానిక రైతులు ట్రాక్టర్లలో ఈ మట్టిని తరలిస్తూ పంట చేలల్లో వేసుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్ నల్ల మట్టికి దూరాన్ని బట్టి రూ. 1000 నుంచి రూ. 1500లు తీసుకుంటున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ ఈ మట్టిపై బడా వ్యాపారుల కన్ను పడింది. ఇంకేముంది రాత్రికి రాత్రే జేసీబీలు, పెద్ద పెద్ద టరాస్‌లు, టిప్పర్లు ఎస్సారెస్పీలో దించేశారు. నల్ల మట్టి వ్యాపారం మొదలు పెట్టేశారు.

రైతుల పేరుతో 'మట్టి' దోపిడీ

బడా వ్యాపారులు రైతుల పేరుతో మట్టి దందా మొదలు పెట్టారు. మండలంలో రత్నాపూర్ కాండ్లీ శివారులోని గోదావరి నదిలోని మట్టిని జిల్లా సరిహద్దులు దాటించి సొమ్ము చేసుకుంటున్నారు. నిజామాబాద్ జిల్లాలోని మెండోరా మండలంలోని పలు గ్రామాలకు గోదావరి నల్ల మట్టిని తరలిస్తున్నారు. ఒక్కో టిప్పర్ మట్టి ధర రూ. 9 వేల నుండి 10 వేలు పలుకుతుండగా, ఒక్కో టరాస్ మట్టి ధర రూ. 13 వేల నుంచి రూ. 15 వేలు పలుకుతోంది. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న మట్టి వ్యాపారులు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

పరిమితికి మించి లోడింగ్.. ధ్వంసమవుతున్న రోడ్లు

పరిమితికి మించిన మట్టి లోడుతో భారీగా వాహనాలు నడుస్తుండటంతో మండలంలోని రోడ్లు ధ్వంసమవుతున్నాయి. గుండంపల్లి - దిలావర్‌పూర్, సాంగ్వి - సిర్గాపూర్ రోడ్లు ప్రతిరోజు రాత్రింబవళ్ళు భారీ మట్టి లోడుతో వాహనాలు రాకపోకలతో చెడిపోతున్నాయి. పరిమితికి మించి మట్టి లోడుతో వాహనాలు జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్నాయి. దీంతో వాహనాల్లో ఉన్న మట్టి రోడ్డుపై పడి ప్రమాదాలకు కారణమవుతోంది. చిన్న పాటి వర్షం జల్లులకే రోడ్డుపై పడ్డ నల్ల మట్టి మెత్తబడి చిన్న వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరిగే అవకాశం ఏర్పడుతోంది. అధికారులు స్పందించి నల్ల మట్టి జిల్లా సరిహద్దులు దాటకుండా చర్యలు తీసుకుని స్థానిక రైతులకు తక్కువ ధరలో మట్టి లభ్యమయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు

● ఎజాజ్ అహ్మద్ ఖాన్, తహసీల్దార్, దిలావర్‌పూర్,



ఎస్సారెస్పీ నుంచి నల్ల మట్టి తరలిస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్ అన్నారు. ఇప్పటి వరకు మట్టి తరలింపుకు ఎవరు అనుమతులు అడుగలేరని, అయితే స్థానిక రైతులు తమ పంట పొలాలకు తరలిస్తుండటం ఎప్పుడు జరిగేదేనని కానీ బడా వ్యక్తులు మట్టితో వ్యాపారం చేస్తున్నట్లు తెలిసిందని, ఇది చట్టవిరుద్ధమన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

బురద చేరి.. రంగుమారి



రంగుమారి బురదమయంగా సరఫరా అయిన మిషన్ భగీరథ నీరు

కుభీర్, మే 4 (ఆంధ్రజ్యోతి) : కలుషిత నీటి సరఫరాతో మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత రెండు రోజులుగా రంగుమారిన కలుషిత నీరు సరఫరా అవుతోంది. ఎండాకాలం కావడంతో నీటి వనరులు అడుగంటాయి. ఈ నేపథ్యంలో నీటిని ఒకటికి రెండు సార్లు శుద్ధి చేసి సరఫరా చేయాల్సి ఉండగా మిషన్ భగీరథ అధికారులు పట్టించుకోక పోవడంతో మట్టితో కూడిన బురదనీరు సరఫరా అవుతోంది. మండల కేంద్రంలోని శివసాయి ఆలయ పరిధిలోని ప్రాంతంలో బుధ, గురువారంలో రంగు మారిన బురదనీరు మిషన్ బగీరథ నల్లాల ద్వారా సరఫరా జరిగింది. నీరు రంగు మాఱి రావడంతో తాగడానికేకాక వాడుకోవడానికి సైతం పనికి రావడం లేదని పలువురు అంటున్నారు. దీంతో వేసవిలో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతూ డబ్బుల ఖర్చు చేసి రక్షిత నటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని అంటున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



బట్టిగల్లీ హనుమాన్ ఆలయం ముందు మిషన్ భగీరథ లీకేజీ పైపులు

● నీటి లీకేజీలే కారణమా..

మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో నాసిరకంగా ఇంట్ర పైప్ లైన్ చేయడంతో తరచూ పైప్‌లైన్లు ధ్వంసమైన నీరు వృధాగా రోడ్డుపై పోతుంది. దీంతో పాటు ఆ లీకేజీ అయిన నీయ ధ్వంసమైన పైపు వద్దనే గుంతలో నిలిచి పోయి కలుషితం అవుతున్నాయి. నీటి సరఫరా నిలిచి పోయిన సమయంలో ఈ కలుషితమైన నీరు తిరిగి పైపులోకి వెళ్లి సరఫరా సమయంలో మంచి నీటితో కలుస్తున్నాయని కొందరు చెబుతుంటే, భైంసా సంపులో ఫిల్టర్ చేయకుండా సంబంధిత శాఖ అధికారులు బురదనీటినే సరఫరా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ జిల్లా అధికారులు స్పందించి బురదనీటిని నివారించి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నా..

● పిట్ల పోశెట్టి, కుభీర్



మిషన్ భగీరథ నీరు రోజు రంగుమారి వస్తున్నాయి. అసలే వేసవి కాలం కావడంతో తాగునీటి అవసరం పెరిగింది. ఈ తరుణంలో నీరు రంగు మారడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాము. తప్పనిసరి పరిస్థితుల్లో తాగు నీటిని కొనుక్కోవాల్సిన వస్తుంది. అధికారులు స్పందించి రక్షిత తాగు నీరు సరఫరా చేయాలి.

అపూర్వం.. విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆదిలాబాద్ శ్రీ సరస్వతి శిశుమందిర్ పూర్వ విద్యార్థులు



జైనథ్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆదిలాబాద్ రూరల్, మే 04 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ పట్టణంలోని ఓల్డ్ హోసింగ్ బోర్డు శ్రీ సరస్వతి శిశుమందిర్ 2001-2002 సంవత్సర 10వ తరగతి బ్యాచ్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం స్థానిక ఓ ఫంక్షన్ హాల్ లో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారికి విద్యా బుద్ధులు నేర్పిన గురుజీలు సులోచన, రాధకృష్ణ, రామ్మోహన్, కాత్యాయనీ, ఇస్తారీ, శంతన్ రావు, చిందుం ఆశన్న, వెంటక రమణ, నీలాకు పాద పూజ చేశారు. అనంతరం వారికి శాలువాలు కప్పి మెమోంటో లు ఇచ్చి సత్కరించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సంతోష్, అశోక్, సురేందర్, రేవంత్, సూది నరేష్, జోగు శివ, రాజు, విజయ్, కోల విక్రమ్, వసంత్, రాజ్యలక్ష్మి, రేణుక, ప్రగతిశీలత, ఉమా మహేశ్వరీ పాల్గొన్నారు.

జైనథ్‌లో అలరించిన ఆత్మీయ సమ్మేళనం

జైనథ్: జైనథ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసి జడ్పీఎస్ఎస్ 2005-2006వ పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అలాంటి జ్ఞాపకాలను ఒకరినొకరు నెమరు వేసకున్నారు. ఈ సందర్భంగా 20 ఏళ్ల కిందట బోధించిన ఉపాధ్యాయులను పూలమాలలు శాలువా జ్ఞాపికతో పాటు భగ వద్గీత గ్రంథంతో సన్మానించారు. కష్ట సుఖాల్లో అందరు పాలు పంచుకోవాలని తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో జైనథ్ ప్రభుత్వం ఉన్నత పాఠశాల హెచ్ఎం మద్దిలస్వన్న, లక్ష్మీకాంత్‌రావ్, వెంకట్ రమణ, సూరజ్, శ్రీనివాస్, మంజుల, వనజా, కృష్ణవేణితో పాటు 2005-06 పదవ తరగతి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

20 సంవత్సరాలకు కలుసుకున్న స్నేహితులు

తలమడుగు: ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చదువుకున్న పూర్వ విద్యార్థులు 20 సంవత్సరాలకు ఒకే వేదికపై కలుసుకుని ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి నిర్వహించారు. పాఠ శాలలో చదువుకునన 2005/2006 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు విద్య నేర్పిన ఉపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, సుధాకర్, ఏలియా, సులోచన, రవి ప్రసాద్‌లను పూలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువా పూలమాలలతో సన్మానించి, అనంతరం జ్ఞాపికలను అందజేసి పాదాభివందనం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తమను, తమ కుటుంబాలను పరిచయడం చేసుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదిపించి మంచి సంస్కారం నేర్పాలని సూచించారు. కార్యక్రమం ఏర్పాటు చేసిన పూర్వ విద్యా ర్థులను అభినందించారు. అదే విధంగా నాటి విద్యార్థిలు శరణ్య, కిషోర్‌లు మాట్లాడుతూ 20 ఏళ్ల తరువాత తమ స్నేహితులను కలుసుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మేకల రవికాంత్ యాదవ్, బడగరి తిరుపతి యాదవ్, బడగిరి శ్రీకాంత్, లక్ష్మణ్, ఆనందరావు, శ్రీకాంత్, శ్రీనివాస్, కిరణ్, మనిత, జ్యోతి, జ్యోత్స్న, పద్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.



తలమడుగు జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం





● ఉట్నూర్‌లోని గిరిజన పారిశ్రామిక వాడ



● ఉట్నూర్ ఎక్స్ రోడ్డులోని లింగోజి తండా వద్ద గిరిజన పారిశ్రామిక వాడలో శిథిలమైన పరిశ్రమల షెడ్లు ఇలా..

ప్రగతికి దూరంగా.. పారిశ్రామిక వాడ!

- ఉమ్మడి జిల్లాలోని గిరిజన యువత కోసం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు
- మూడు దశాబ్దాలు గడిచినా.. ముందుకు సాగని పారిశ్రామిక అభివృద్ధి
- అన్యాక్రాంతం అవుతున్న పరిశ్రమల షెడ్లు
- నీరుగారిన ఆశయం.. . దరిచేరని అభివృద్ధి ఫలాలు
- ఎక్కడికక్కడ మూతబడ్డ పరిశ్రమలు
- 1998లో ఉట్నూర్ ఎక్స్ రోడ్డులోని లింగోజి తండా వద్ద గిరిజన పారిశ్రామిక వాడ ఏర్పాటు

ఉట్నూర్, మే 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజనులను పారిశ్రామిక వేత్తలుగా చేయాలన్న సంకల్పంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పారిశ్రామిక వాడ ప్రగతికి దూరంగా ఉండిపోతోంది. పారిశ్రామిక వాడ ఏర్పాటు చేసి మూడు దశాబ్దాలు కావొస్తున్నా.. ముందుకుసాగడం లేదంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజన యువతకు ఉపాధి కోసం ఏర్పాటు చేసిన పారిశ్రామిక వాడ అభివృద్ధికి దూరం అయ్యింది. ఐటీడీఏ అధికారుల ప్రోత్సాహం కరువు కావడంతో పరిశ్రమలు మూతబడ్డాయని గిరిజనులు పేర్కొంటున్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయడంలో చూయించిన ఉత్సాహం ఉపాధి కల్పించడంలో అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తించిందని, తద్వారా అప్పులు పెరిగిపోయి పరిశ్రమలు దివాలా తీశాయని గిరిజనులు వాపోతున్నారు.

అలంకారప్రాయంగా పారిశ్రామిక వాడ

ఉమ్మడి జిల్లాలోని ఉట్నూర్, ఆదిలాబాద్, నిర్మల్ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ గిరిజన యువతకు పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి కల్పించాలని ఉట్నూర్ ఐటీడీఏ అధికారులు ఉట్నూర్ మండలంలోని ఎక్స్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన పారిశ్రామిక వాడ అలంకారప్రాయంగా మారడంతో ఆశయం నీరుగారింది. 1998లో ఉట్నూర్ ఐటీడీఏ అధికారులు జిల్లా పరిశ్రమల శాఖ అధికారుల సమన్వయంతో ఉట్నూర్ ఎక్స్ రోడ్డులోని లింగోజి తండా వద్ద గిరిజన పారిశ్రామిక వాడను ఏర్పాటు చేశారు. ముందుగా స్థలాన్ని సేకరించిన అధికారులు ఉట్నూర్ ఐటీడీఏకు అనుబంధంగా ఉండే హాస్టళ్లలో, గురుకుల పాఠశాలల్లో, పండ్ల తోటల ఉద్యానవనాలు, ఇంజనీరింగ్ విభాగానికి అవసరానికి వచ్చే వస్తువులు సరుకులను పారిశ్రామిక వాడలో ఉత్పత్తి చేసి గిరిజన యువతకు ఉపాధి కల్పించేలా ప్రణాళికలు చేశారు. ముందుగా మొత్తం 15 షెడ్‌లను ఏర్పాటు చేసి రూ.నాలుగు లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు పెట్టి శేషారావుకు పాలిథిన్ బ్యాగుల తయారీ కేంద్రం, కాశీరం గంగారాం నాయక్‌లకు నోటుబుక్స్ తయారీ, విఠల్‌కు ట్రంక్ బాక్సులు తయారీ, రాథోడ్ మోహన్‌కు బ్రెడ్ యూనిట్, గేడం మనోహర్‌కు పప్పుల పరిశ్రమ, తిలావత్ ధరంసింగ్‌కు ఆయిల్ మిల్, జాదవ్ లింగోజికి పసుపు మిర్చి తయారీ, సిడాం శంబుకు ఇంజనీరింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేశారు.

2001లో మూతబడ్డ పరిశ్రమలు

ఐటీడీఏ అధికారుల ప్రోత్సాహం కరువై పోవడంతో 2001లో పారిశ్రామిక వాడలోని పరిశ్రమలు మూతబడ్డాయి. గిరిజనుల పరిశ్రమల్లో ఉత్పత్తి చేసిన సరుకులు వస్తువులకు మార్కెటింగ్ లేకపోవడంతో పరిశ్రమలు మూతబడగా కరెంట్ బిల్లులు పెరిగి పరిశ్రమల నిర్వాహకులకు అప్పులు పెరిగి పోయాయి. పాలిథిన్ పరిశ్రమలు ఉత్పత్తి చేసిన.. పాలిథిన్ కవర్లను ఐటీడీఏ ఉద్యానవన తోటలకు అంట్లు కట్టే మొక్కల కవర్ల కోసం కొనుగోలు చేసి ఉపాధి కల్పించాలని భావించారు. అదేవిధంగా నోట్ పుస్తకాల పరిశ్రమలు ఉత్పత్తి చేసే నోటు పుస్తకాలను గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలల విద్యార్థుల అవసరాల కోసం కొనుగోలు చేయాలని, ట్రంక్ బాక్స్‌లను సైతం విద్యార్థుల కోసం కొనుగోలు చేయాలని, దాల్ మిల్‌లో ఉత్పత్తి అయ్యే పప్పులు, ఆయిల్ మిల్లులో ఉత్పత్తి అయ్యే నూనెను, పసుపు మిర్చి పౌడర్‌లను హాస్టళ్లు, గురుకుల కళాశాలలు, పాఠశాలల విద్యార్థుల కోసం కొనుగోలు చేయాలని, ఇంజనీరింగ్ పరిశ్రమ ఉత్పత్తులను ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్మాణం చేసే భవనాల పనులకు తలుపులు, కిటికీలు, తదితర వాటిని కొనుగోలు చేయాలని పారిశ్రామిక వాడని ఏర్పాటు చేశారు. కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల గిరిజన శ్రామిక వాడలో తయారు అవుతున్న వస్తువులు కొనుగోలు చేయక పోవడం ద్వారా గిరిజన పరిశ్రమ వాడలో ఉత్పత్తులు చేసిన వస్తువులకు గిరాకీ లేక ఉత్పత్తులు అమ్మక పోవడంతో పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసుకున్న పరిశ్రమల నిర్వాహకులు ఇబ్బందులకు గురవుతూ వచ్చారు. రెండవ సారి కూడా పరిశ్రమల పునరుద్ధరణకు పూనుకున్నా.. ఎక్కువ కాలం మనుగలేదు. ఈ పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసుకున్న గిరిజనులు ధరమ్ సింగ్, జాదవ్ లింగోజి, సిడాం శంబులు వివిధ కారణాలతో మృతి చెందారు. అంతేకాకుండా మరి కొందరు వ్యవసాయం చేసుకుంటూ గ్రామాలకు పరిమితమయ్యారు. ఫలితంగా పరిశ్రమలు మూతబడ్డాయి.

ఆక్రమణకు గురవుతున్న షెడ్లు

ఎంతో గొప్ప ఆశయంతో ఐటీడీఏ అధికారులు ఏర్పాటు చేసిన పారిశ్రామిక వాడలోని షెడ్లు అన్యాక్రాంతం అవుతున్నాయి. పారిశ్రామిక వాడలోని షెడ్లు ఖాళీగా ఉండడంతో ఇతరుల కళ్లు పడ్డాయి. ఫలితంగా వివిధ సంఘాల నాయకులతో పాటు మరికొందరు వివిధ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామంటూ ఆక్రమిస్తున్నారు. ప్రజా మిత్ర రైతు సహకార సంస్థ ఆధ్వర్యంలో ఒక షెడ్డును ఆక్రమించగా, ఆదివాసీ ఆహారం నిర్వాహకులకు ఐటీడీఏ అధికారులు ఒక షెడ్డు అప్పగించారు. రెండేళ్ల క్రితం బల్క్ మిల్క్ యూనిట్ ఏర్పాటు కోసం ఒక షెడ్డును అప్పగించగా.. అందులో ఏర్పాటు చేసిన బల్క్ మిల్క్ యూనిట్ షెడ్డు అలంకారప్రాయంగా మారింది. మరికొన్ని షెడ్లు శిథిలదశకు చేరుకుంటుండగా.. మరికొన్ని సంఘాలు సైతం అధికారులు సైతం అధికారుల ప్రోత్సాహంతో షెడ్లు ఆక్రమిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఎంతో ఆశయంతో ఏర్పాటు చేసిన పారిశ్రామిక వాడను అభివృద్ధి పథంలో నడిపించేలా చర్యలు తీసుకోవాలని.. ఆసక్తి ఉన్న పారిశ్రామిక నిర్వాహకులకు ఉపాధి కల్పించాలని జిల్లాలోని గిరిజనులు కోరుతున్నారు.

అధికారుల ప్రోత్సాహం కరువైంది

: పవర్ గంగారాం నాయక్, నోట్‌బుక్స్ యూనిట్ నిర్వాహకుడు



ఎంతో ఆశయంతో ఏర్పాటు చేసిన ఐటీడీఏ పారిశ్రామిక వాడలో నేను నోట్‌బుక్స్ యూనిట్ పరిశ్రమను ఏర్పాటు చేశాను. ప్రారంభంలో అధికారులు ప్రోత్సాహించారు. కానీ ఆ తర్వాత వచ్చిన అధికారులు ప్రోత్సహించక పోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయి పరిశ్రమను మూసివేశాను. అధికారులు తిరిగి ప్రోత్సాహం ఇస్తే పునరుద్ధరిస్తాను.

ఆదివాసీ యువతకు పరిశ్రమల్లో ప్రోత్సహించాలి

: మెస్రం దుర్గు పటేల్, జిల్లా మేడి



ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గిరిజన యువతకు స్వయం ఉపాధి రంగాలలో రాణించేలా పరిశ్రమలను ఏర్పాటు చేయాలి. మరిన్ని పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేసి ఐటీడీఏ ద్వారా గిరిజన యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పారిశ్రామిక వాడను పునరుద్ధరించాలి

: రితేష్ రాథోడ్, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు



ఐటీడీఏ ఆధ్వర్యంలో మూడు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులోని పారిశ్రామిక వాడను పునరుద్ధరించాలి. ఎంతో ఆశయంతో ఏర్పాటు చేసిన పారిశ్రామిక వాడలో అధికారుల ప్రోత్సాహం కరువై పోవడంతో గిరిజన యువకులు నష్టపోయారు. తిరిగి పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలి.

ప్రశాంతంగా నీట్ పరీక్ష

- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



పరీక్షా కేంద్రంలో అభ్యర్థుల పరిశీలనను చూస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

ఆదిలాబాద్ రూరల్, మే 04 (ఆంధ్రజ్యోతి) : ఎంబీబీఎస్ ప్రవేశాల కోసం చేపట్టిన నీట్ 2025 ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రంలో 1659 మంది అభ్యర్థుల కోసం ఏడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగింది. కాగా అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట 30 నిమిషాల వరకు అనుమ తించారు. ఆయా కేంద్రాల వద్ద అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం లోనికి పంపించారు. బయోమెట్రిక్, ఫెస్‌క్యాప్చర్, గుర్తింపుకార్డులు, హాల్‌టికెట్లను పరిశీలించారు. గడియారాలు, ఇతర వస్తువులను నిషేధించారు. కొందరి పరీక్ష కేంద్రం వద్దనే చెవికి కమ్మలు, గాజులు తీసేసి వారితో పాటు వచ్చిన వారికి అందించారు. కాగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో ఏఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీ జీవన్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు. ఇదిలా ఉంటే బాలికల ఉన్నత పాఠశాలలో ఓ అభ్యర్థి సమయం దాటిన రావడంతో అధికారులు ఆమెను అనుమతించలేదు. హాల్‌టికెట్‌పై సమయం ఇచ్చిన సరి చూసుకోలేదని, మధ్యాహ్నం రెండు గంటలకు పరీక్షని అలస్యంగా వచ్చినట్లు తెలిపారు. అభ్యర్థి అధికారులకు తన సమస్య చేప్పిన నిబంధనల ప్రకారం లోనికి అనుమతించలేదు. దీంతో ఆమె తిరిగి వెళ్లిపోయింది. మరో పక్క పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి పరిశీలించారు. పరీక్ష కొనసాగుతున్న తీరును తెలుసుకున్నారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే అనుమతించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ.. నీట్ ప్రశాంతంగా కొనసాగుతుందన్నారు. అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా కేంద్రాలను ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. ఉదయం 11 గంటల నుంచే కేంద్రాల్లోకి అభ్యరులను అనుమతించడం జరిగిందన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో తాగునీటితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచామని వివరించారు. మొత్తం 1659 మంది అభ్యర్థులకు గాను 1621 మంది 97.71 శాతం హాజరయ్యారు. 38 మంది గైర్హాజరయ్యారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థి



పరీక్ష కేంద్రం వద్ద అధికారులు, సిబ్బంది

'జనగణనతో పాటు కులగణన చరిత్రాత్మకం'



ప్రధానమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు

ఇంద్రవెల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా జనగణనలో భాగంగా కుల గణన చేపట్టాలని ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని బీజేపీ మండల అధ్యక్షుడు కేంద్రే బాలాజీ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో మోదీ చిత్ర పటానికి మండల నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టడం ద్వారా బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. మోదీ తీసుకున్న నిర్ణయం యావత్ దేశప్రజలందరూ హర్షించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు పద్వాల్ విజయ్‌సింగ్, మాజీ అధ్యక్షుడు అరేల్లి రాజలింగం, మహిళా మోర్చా అధ్యక్షురాలు రాథోడ్ రాధిక, ప్రధాన కార్యదర్శి రాథోడ్ భీంరావు, నాయకులు అడాన్ చంపత్‌రావు, దేవపూజ్ మారుతి, దీపక్ సింగ్ శేకావత్, కనక తుకారం, మోరే దిలిప్, తుకారం పాల్గొన్నారు.

దేశీదారు తరలిస్తున్న ఇద్దరి అరెస్టు



ఎక్సైజ్ అధికారుల తనిఖీల్లో పట్టుబడిన దేశీదారు, నిందితులు

ఆదిలాబాద్‌అర్బన్, మే4 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి అక్రమ దేశీదారు రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రేండ్ల విజేందర్ తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్, డీటీఎఫ్, ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో సంయుక్తంగా బోరజ్‌లోని డొలార గ్రామ శివారులో తనిఖీలు చేయగా ఆదిలాబాద్‌లోని గాంధీనగర్, ఒడ్డెర కాలనీలకు చెందిన సురరవి, చింతల సుజాత దేశీదారు సీసాలను ఆటోలో రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.45720 విలువ గల 90మి.లీ దేశీదారు స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసి జైలుకు తరలించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. ఎవరైనా దేశిదారు విక్రయాలు, రవాణ, తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని పేర్కొన్నారు. దాడులలో డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ముత్యం,ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ అక్బర్‌హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

భగీరథ మహర్షి జయంతి వేడుకలు



పూలమాల వేస్తున్న కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్‌అర్బన్ :జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం భగీరథ మహర్షి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ రాజార్షిషా హాజరై భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠ్య పుస్తకాల్లో భగీరథ జీవిత చరిత్ర ఉందని, భావితరాలకు వాటి గురించి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి రాజలింగు, సిబ్బంది, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సోల్జర్ దంపతులకు సన్మానం



సోల్జర్ దంపతులను సన్మానిస్తున్న మాజీ జడ్పీ చైర్మన్

ఉట్నూర్, మే4(ఆంధ్రజ్యోతి):భారత సైన్యంలో 38 సంవత్సరాలు పని చేసిన కాశీనాథ్ సేవలు అమోఘమని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. ఆదివారం స్థానిక నాయక్‌నగర్‌లో పదవి విరమణ పొందిన సోల్జర్ కాశీనాథ్ దంపతులను గ్రామస్థులు, అభిమానులు, బంధువులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ చైర్మన్ రాథోడ్‌జనార్ధన్ భారత జాతి గర్వపడేలా దేశానికి సేవలు అందించిన కాశీనాథ్ ప్రస్తుతం గ్రామస్థులకు, సమాజం కోసం పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ సైన్యంలో పని చేయడం ఆషామాషీ కాదని, దేశ ప్రజల క్షేమం కోసం సైన్యం ఆహర్నిశలు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో వారితో పాటు ఎస్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్‌చౌహాన్, పీఏసీఎస్ చైర్మన్ సురేష్‌ఆడే, ప్రకాష్, రవీందర్, రాథోడ్‌గణేష్, ధారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు : బోథ్ ఎమ్మెల్యే



జొన్న పంట కొనుగోలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సోనాల, మే4 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే జోన్న పంటను విక్రయించాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్‌అనిల్ పేర్కొన్నారు. మండలంలోని స్థానిక కాటన్‌జిన్నింగ్ ఫ్యాక్టరీలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేం ద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలని, అలాగే కేంద్రం నిర్వాహకులు రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూసుకోవాలని జోన్నకొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా సాగేలా అధికారులు ప్రతిరోజు పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్ర మంలో మార్కె ట్‌చైర్మన్ గంగయ్య, మాజీ ఎంపీపీతుల శ్రీనివాస్, పీఏసీఎస్ ప్రశాంత్, సోసైటీ డైరెక్టర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు

- ఆదిలాబాద్ జిల్లా తలమడుగులో 44.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు

ఆదిలాబాద్‌అర్బన్, మే4 (ఆంధ్రజ్యోతి)ఆదిలాబాద్ జిల్లాలో భానుడి భగభగలతో పగటి ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగి పోతున్నాయి. దీంతో జిల్లాలోని పలు చోట్ల రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదివారం జిల్లా సగటు గరిష్ట ఉష్ణోగ్రత 43.3 డిగ్రీలు కాగా కనిష్టంగా 26.2డిగ్రీలు నమోదయ్యాయి. అత్యధికంగా తలమడుగు మండలంలో 44.7, సిరికొండలో 44.5, ఆదిలాబాద్‌రూరల్‌లో 44.4, మావలలో 44.2, జైనథ్‌లో 44.1, ఆదిలాబాద్‌అర్బన్‌లో 43.9 గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్ల 40 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దంటూ సూచిస్తున్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలకు అనుగుణంగానే కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా భారీగా పెరిగి పోతున్నాయి. జిల్లా అంతటా 20 డిగ్రీలకు పైగానే కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మండిపోతున్న ఎండలకు ఉపాధి కూలీలు, రైతులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పగలంతా తీవ్రమైన ఎండలు రాత్రంతా ఉక్కపోతతో జనం అవస్థల పాలవుతున్నారు. ఏ కొద్ది సేపు కరెంట్ సరఫరా నిలిచి పోయిన ఉక్కపోత నుంచి తట్టుకోలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఎండ వేడిమి నుంచి తట్టుకునేందుకు ప్రజలు ఏసీలు, కూలర్లను ఏర్పాటు చేసుకుని ఇండ్లలోనే సేదతీరుతున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో పనులను ముగించుకుని ఇంటికే పరిమితమవుతున్నారు. మే మాసంలో ఎండల తీవ్రత మరింతగా ఉంటుందని అధికారులు హెచ్చరికలు చేస్తున్నారు.